
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 30.0 కనిష్ఠం : 16.0
ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
సోమవారం 6 జనవరి 2025



ఓపెన్ డిగ్రీలో డ్రాప్ అవుట్స్‌కు రీ అడ్మిషన్‌కు అవకాశం

- కో ఆర్డినేటర్ రాజు

కల్వకుర్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : 1987 నుంచి 2012 సంవత్సరం వరకు అడ్మిషన్ తీసుకుని అనివార్య కారణాల వల్ల డ్రాప్ అవుట్ అయిన విద్యార్థులు రీ అడ్మిషన్ పొందవచ్చునని కల్వకుర్తి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సెంటర్ కో ఆర్డినేటర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాప్ అవుట్ అ యిన విద్యార్థులు రీ అడ్మిషన్ కోసం ఆన్‌లైన్ లో ఫీజులు చెల్లించి అడ్మిషన్ పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని డ్రాప్ అవుట్స్ అయిన వారు సద్వినియోగం చేసుకోవాలని రాజు కోరారు.

శ్రీరంగాపురం ఆలయానికి

ఈవో లేక భక్తుల అగచాట్లు



7

అమ్మకానికి టెక్నికల్ పోస్టులు

- ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందినే మెడికల్ కళాశాల సిబ్బందిగా మార్చే యత్నం
- ఒక్కొక్కరి నుంచి రూ. లక్ష దాకా ముడుపులు?
- కీలక పాత్ర పోషిస్తున్న మెడికల్ కళాశాల సిబ్బంది
- చోద్యం చూస్తున్న జిల్లా అధికారులు



జోగుళాంబ గద్వాల జిల్లాలో కాంట్రాక్ట్ పోస్టులు అమ్మకానికి పెట్టారనే ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు, సిబ్బంది అండదండలు, అందుకు తగ్గ ముడుపులు ముడితే గుట్టు చప్పుడు కాకుండా పనులు చకా చకా అయిపోతాయనే విమర్శలు వస్తున్నాయి. 6



కర్నెతండా లిఫ్టులో భాగంగా పూర్తయిన పంప్ హౌస్ నిర్మాణం



కర్నెతండా పంప్ హౌస్‌కు సాగునీటిని సరఫరా చేసే సీసీ రోలింగ్ కెనాల్

సబ్‌స్టేషన్ కోసం నిరీక్షణ

- కర్నెతండా లిఫ్టు పనులు 95 శాతం పూర్తి
- రెండు జిల్లాల్లో 4,235 ఎకరాలకు సాగునీరు
- వానాకాలం నాటికి ఎత్తిపోసే అవకాశం
- గిరిజన రైతుల ఎదురుచూపు

వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని ఎత్తైన ప్రాంతపు భూములకు సాగునీరు అందించేందుకు కర్నె తండా ఎత్తిపోతల పథకం చేపట్టారు. ఈ ఎత్తిపోతలు ప్రారంభిస్తే నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం, వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం, పెద్దమందడి మండలాల్లో మొత్తం 4,235 ఎకరాలకు సాగునీరందనున్నది. కానీ సబ్‌స్టేషన్ పనులు అసంపూర్తిగా ఉండటంతో సాగునీరందడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల రైతులు సబ్‌స్టేషన్ నిర్మాణం ఎప్పుడు పూర్తి అవుతుందోనని నిరీక్షిస్తున్నారు.

- ఖిల్లాఘణపురం, ఆంధ్రజ్యోతి

6

గద్వాల డీఎస్పీగా

మొగులయ్య

జోగుళాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు



అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న డీఎస్పీ మొగులయ్య

అలంపూరు/గద్వాల క్రైం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మొగులయ్య ఆదివారం జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. విశేష పూజల అనంతరం శేషవస్త్రాలతో సత్కరించారు. అంతకు ముందు ఆయన జోగుళాంబ గద్వాల జిల్లా డీఎస్పీగా ఆదివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు శుభాకాంక్షలు తెలిపారు.

వెనుకబాటుకు పాలకులే కారణం

- డిండి ఎత్తిపోతలను శాశ్వతంగా ఉపసంహరించుకోవాలి
- పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు జి.హరగోపాల్



తెలంగాణ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పాలమూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): 'ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వెనుకబాటుకు పాలించే పాలకులే ప్రధాన కారణం. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను పక్కకు పెట్టడం సరైందికాదు. డిండి ఎత్తిపోతల పథకాన్ని శాశ్వతంగా ఉపసంహరించుకోవాల'ని పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు జి.హరగోపాల్, కన్వీనర్ ఎం.రాఘవాచారిలు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవనంలో పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరగోపాల్, రాఘవాచారి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ప్రజలు సాగు, తాగునీటి కోసం పోరాటం చేస్తున్న క్రమంలో నీరు రాలేదుకాని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం తెలంగాణ ఏర్పడిందన్నారు. 1990 నుంచి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ప్రత్యక్ష పోరాటానికి వచ్చి 35 ఏళ్ల పూర్తయ్యిందని చెప్పారు. కృష్ణానదిలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వాటా దక్కాలన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన సీఎం ఏ.రేవంత్‌రెడ్డి సమక్షంలో డిండి ఎత్తిపోతలకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలుపడం అమానుషమన్నారు. ప్రజలకంటే కేబినెట్ ప్రధానమైందికాదన్నారు. పాలమూరు-డిండి పేరుతో నీటిని తీసుకుపోవటం తక్షణమే ఆపాలన్నారు. నదుల అనుసంధానం పేరుతో కేంద్రం ఆధీనంలోకి తీసుకుంటే జిల్లాకు ఒరిగిందేమీ లేదన్నారు. ఉమ్మడి జిల్లాకు కృష్ణానదిలో నీటివాటా న్యాయంగా కావాలన్నారు. జలవనరుల నిపుణులు, పార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసంగించారు. 1994లోనే కృష్ణానదిలో నీటివాటా కోసం మహబూబ్‌నగర్ జిల్లాలోనే తెలంగాణ ఉద్యమం ప్రారంభమైందని గుర్తు చేశారు. 2013లోనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జూరాల నుంచి నీరు తీసుకునేలా సాధించుకున్నామని తెలిపారు. తొమ్మిదిన్నరేళ్ల పా లించిన బీఆర్ఎస్ ప్రభుత్వం, ఏడాది నుంచి కాంగ్రెస్ పాలన చూస్తే ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడ కురిసినా.. అక్కడే నిలిపి భూగర్భ జలపరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. దాంతో ఎక్కువ నీరు ఎత్తిపోసుకునే అవసరం తగ్గించాలన్నారు. రాజ్యాంగ ప్రతిపాదిత ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం విడుదల చేసిన గోదావరి-కృష్ణ నదుల స్వా ధీన ఉత్తర్వు రద్దు కోసం రాష్ట్రం ప్రభుత్వం పోరాడాలన్నారు. నీటి లభ్యత, నిర్వహణ ప రమైన సమస్యల దృష్ట్యా పంటల వైవిధ్యం కాపాడటం కోసం సాగు నిర్వహణకు వ్యవసాయాధికారులను, నీటి నిర్వహణకు లష్కర్లను నియమించాలన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు సాగునీటి వనరుల కల్పనలో న్యాయం కోసం ఇంజనీర్లతో ఒక కమిటీ వేసి, అధ్యయనం చేయించాలన్నారు.

కూతురికి నివాళులర్పించడానికి వచ్చిన తల్లి మృతి

7



యూనియన్ బ్యాంకు వద్ద విచారణ చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లరావు(ఫైల్)

పోలీసుల అదుపులో బ్యాంకు దొంగలు!

6

తెగిన చెరువు అలుగు

- పట్టించుకోని అధికారులు

పెద్దమందడి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం పంట కాలం సీజన్ కావడంతో రై తులు ప్రతీ నీటి చుక్కను కాపాడుకునే ప్ర యత్నం చేస్తున్నారు. చెరువు అలుగు వద్ద గండి పడి నీరు వృథా అవుతోంది. పెద్దమం దడి మండలం గట్లఖానాపురం గ్రామ నల్ల కుంట చెరువుకు సాగునీరు వచ్చింది. సాగు నీరు చెరువుకు వచ్చే ముందు చెరువు కట్ట ను అలుగును పర్యవేక్షణ చేయాల్సిన నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోలేదు. చెరువుకు పూర్తి స్థాయిలో నీరు రావడంతో అలుగు వద్ద గండి పడి నీరు వృథా అవుతోంది. దీన్ని గమనించిన రైతులు మండల నీటి పారుదల అధికారులకు సమాచారం ఇవ్వడానికి ప్రయత్నం చేయగా.. అందుబాటులోకి రాకపోవడంతో రైతులు నేరుగా గండి పూడ్చారు. సోమవారం అయినా అధి కారులు స్పందించి శాశ్వత పరిష్కారం చేయాలని కోరుతున్నారు.



గండి పడి వృథాగా పోతున్న నీరు

సివిల్స్ టాపర్‌కు ఆర్థిక సహాయం

వంగూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి గోకమల్ల ఆంజనేయులు సివిల్ టాపర్‌గా నిలిచాడు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆంజనేయులు రూ. లక్ష చెక్కును సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నాడు. ఆంజనేయులు సివిల్స్ ఇంటర్వ్యూకు ఎంపికైన శుభసందర్భంగా ఈ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా చెక్కును అందుకుంటున్న ఆంజనేయులు

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు పది ప్రదర్శనలు





జోగుళాంబ గద్వాల జిల్లాలో సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు

గద్వాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గద్వాల పట్టణంలోని బాలుర హైస్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థులు ప్రతిభ చూపించారు. ప్రతీ విద్యార్థి తన నైపుణ్యాలను ప్రదర్శించిన తీరు అందరిని ఆకట్టుకుంది. అయితే అందులో పది ప్రదర్శనలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. అందులో ఓ రిసోర్స్ మేనేజ్‌మెంట్ అంశంలో జూనియర్స్ కేటగిరిలో ఎం పవన్ జడ్పీహెచ్ఎస్ ఉత్తనూర్. సీనియర్స్ విభాగంలో జడ్పీహెచ్ఎస్ ఉండవల్లి విద్యార్థి తరుణ్ ఎంపికయ్యారు. నేచురల్ ఫామింగ్ అంశంలో జూనియర్స్ క్యాటగిరిలో అక్షర కాన్సెప్ట్ స్కూల్ గద్వాల విద్యార్థి జయవంశిక, సీనియర్స్ విభాగంలో ఏకశివ ఇంటర్‌నేషనల్ స్కూల్ ఎర్రవల్లి విద్యార్థి జ్యోతిక ఎంపికయ్యారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అంశంలో జూనియర్స్ క్యాటగిరిలో బ్రైట్‌స్టార్ హైస్కూల్ అయిజ విద్యార్థి జరీమిప్రిన్స్, సీనియర్ క్యాటగిరిలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల గద్వాల విద్యార్థిని జరాఅత్తర్ ఎంపికయ్యారు. ఫుడ్ హెల్త్ హైజీన్ అంశంలో జూనియర్స్ క్యాటగిరిలో శ్రీ శారద ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ గద్వాల విద్యార్థి శ్రీ, సీనియర్స్ క్యాటగిరిలో జడ్పీహెచ్ఎస్ శెట్టిఆత్మకూర్ విద్యార్థి తిరుమలేష్ ఎంపికయ్యారు. ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్ అంశంలో జూనియర్ క్యాటగిరిలో విశ్వశాంతి హైస్కూల్ ఉండవెల్లి విద్యార్థి మౌనిక, సీనియర్స్ క్యాటగిరిలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి వినయ్ ఎంపికయ్యారు. మ్యాథమెటిక్స్ మోడలింగ్ అంశంలో జూనియర్ క్యాటగిరిలో సరస్వతీ టాలెంట్ స్కూల్ గద్వాల విద్యార్థి వరుణ్, సీనియర్ క్యాటగిరిలో ఇండో ఇంగ్లిష్ హైస్కూల్ గద్వాల విద్యార్థి ఉషశ్రీ ఎంపికయ్యారు. వేస్ట్ మేనేజ్‌మెంట్ అంశంలో జూనియర్స్ విభాగంలో అక్షర కాన్సెప్ట్ స్కూల్ గద్వాల విద్యార్థి అచ్యుత్, సీనియర్ క్యాటగిరిలో శ్రీ శారద ఇంగ్లిష్ మీడియం గద్వాల విద్యార్థి సోహెల్ ఎంపికయ్యారు. ఇన్‌స్పైర్ అంశంలో సాయి, అహల్య, అక్కల వైష్ణవి, లక్ష్మ, అల్ఫీషా, వీరపపోగు సూర్యకిరణ్ ఎంపికయ్యారు. సెమినార్ విభాగంలో నోబుల్ హైస్కూల్ గద్వాల విద్యార్థి కావ్య, టీచర్స్ ఎగ్జిబిట్స్ అంశంలో ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల గద్వాల విద్యార్థి నాగరాజు ఎంపికయ్యారు. వీరిని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అభినందించి ప్రసంశాపత్రాలను అందించారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకమైన అంశాలను బయటకు తీయడానికి ఇలాంటి సైన్స్‌ఫెయిర్ ఉపయోగపడుతాయని వివరించారు. కార్యక్రమంలో డీఈవో, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన వైజ్ఞాన ప్రదర్శన - జోగుళాంబ గద్వాలలో ముగిసిన సైన్స్ ఫెయిర్ - పాల్గొన్న 302 పాఠశాలలు, 6

సాగు చేస్తున్న ప్రతీ ఎకరాకు రైతు భరోసా

-ఎకరాకు రూ 12వేల రైతు భరోసా

-ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగు చేస్తున్న ప్రతీ ఎకరాకు రైతు భరోసా రూ.12వేలు అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు నియో జకవర్గ ప్రజల తరుఫున ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రైతుభరోసా పథకం ద్వారా రాష్ట్రంలో సాగుచేస్తున్న ప్రతీ ఎకరాకు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి అయ్యిందని, త్వరలో పునాదులు వేస్తామన్నారు. బీసీలకు ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వ కాంగ్రెస్ ప్రభుత్వం అని తెలిపారు. ఎకకాలంలో రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లేష్, లక్ష్మీనరసింహ, రాములు, గోపాల్‌రెడ్డి, రామనాథం, అనంతరెడ్డి, నాయకులు ఉన్నారు.

ఫాంపాండ్‌లో పడి రైతు మృతి



బంగారయ్య (ఫైల్)

బిజినేపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఫాంపాండ్‌లో పడి రైతు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని నందివడ్డేమాన్‌లో చోటుచేసుకున్నది. ఆదివారం ఎస్ఐ కే శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు నంది వడ్డెమాన్ గ్రామానికి చెందిన రైతు బంగారయ్య (45) పొలంలో తవ్విన ఫాంపాండ్ ద్వారా పంట సాగు చేశాడు. రోజు మాదిరిగా శనివారం సాయంత్రం పంటకు నీరు పారించేందుకు వెళ్లాడు. ఫాంపాండ్‌లో ఏర్పాటు చేసిన మోటారు ఫుట్‌బాల్‌కు చెత్త అడ్డు వచ్చి నీళ్లు రాలేదు. తాడు సాయంతో నీటిలోకి దిగి చెత్త తీస్తుండగా తాడు తెగిపోయింది. అతనికి ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో భార్య జయమ్మ ఆదివారం ఉదయం బంధువుల తో కలిసి పొలం వద్ద వెతికారు. ఫాంపాండ్ (నీటి గుంత)లో శవమై తేలా డు. ఈ ఘటనపై భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉన్నత విద్యా విధానంలో..

మార్పులు అవసరం

- విద్యా హబ్‌గా నాగర్‌కర్నూల్
- విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా ఉన్నత విద్యా విధానంలో మార్పులు అవసరమని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ పట్టణంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఉన్నత విద్యా మండలి చైర్మన్ విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత ప్రపంచీకరణ పరిస్థితుల్లో ఉన్నత విద్య చదివిన యువత కూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవడంలో వెనుకబడుతున్నారని, కారణం చదివిన చదువుకు, చేస్తున్న పనికి సంబంధం లేకుండా పోయిందని అన్నారు. ఆ లోపాన్ని తొగలించేందుకు ఉన్నత విద్యను పూర్తి చేసిన ప్రతీ ఒక్కరు ఉద్యోగం, ఉపాధి అవకాశాలు పొందాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించిందన్నారు. రాష్ట్ర ఉన్నత మండలి చైర్మన్ బాధ్యతలు చేపట్టిన తాను మొదటగా ఇంజనీరింగ్, సోషల్ సైన్స్ కోర్సుల సిలబస్‌లో మార్పులు తీసుకురావడానికి అధ్యాయనం ప్రారంభించానని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా వాసిగా ఈ ప్రాంతాన్ని విద్య హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తానన్నారు.

మోడల్ స్కూల్లో ప్రవేశానికి

దరఖాస్తులకు ఆహ్వానం

ఖిల్లాగణపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఖిల్లాఘణపురం మండలంలోని దొంతికుంట తండా మోడల్ స్కూల్ పాఠశాలలో ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 28లోగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్‌లో 2025-26విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో పూర్తిస్థాయిలో ప్రవేశాలు ఉంటాయని, ఏడు నుంచి 10వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్లకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 13వ తేదీన నిర్వహిస్తారని తెలిపారు. పాఠశాలలో ప్రవేశ పరీక్షకు ఓసీ విద్యార్థులకు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.125 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నెల ఆరు నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని వివరించారు.



ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శన



వ్యర్థ పదార్థాలతో వస్తువులను తయారుచేసే ప్రదర్శన

అలరించిన వైజ్ఞానిక ప్రదర్శన

- జోగులాంబ గద్వాలలో ముగిసిన సైన్స్ ఫెయిర్
- పాల్గొన్న 302 పాఠశాలలు
- 248 రకాల ప్రాజెక్టుల ప్రదర్శన
- టెక్నాలజీ ఉపయోగంతో అద్భుతాలు చేసిన చిన్నారులు

అయిజ టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నుంచి జరుగుతున్న జిల్లా స్థాయి బాలల వైజ్ఞానిక ప్రదర్శనలు ఆదివారంతో ముగిశాయి. ప్రదర్శనలో జిల్లా వ్యాప్తంగా 302 రెండు పాఠశాలలు పాల్గొని, వివిధ రకాల ప్రయోగాలను ప్రదర్శించాయి. ఆరు నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు అబ్బురపరిచాయి. నేడు విరివిగా దొరికే టెక్నాలజీని ఉపయోగించుకుని జీవితంలో అభివృద్ధి చెందేందుకు ఎటువంటి వస్తువులను తయారు చేసుకోవచ్చని ప్రదర్శించిన ప్రయోగాలు ఆలోచింపజేశాయి.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

అయిజ మండలం చిన్నతాండ్రపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత తెలుపుతూ ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణాన్ని పరిరక్షించటం, సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా ఆరోగ్యాలను ఎలా కాపాడుకోవాలో విద్యార్థులు చక్కగా వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేయటం వల్ల నేలను సంరక్షించే విధానంపై చిన్నారులు వివరించిన విధానం ఆకట్టుకుంది.



చెరకు పిప్పితో శానిటరీ ప్యాడ్స్ తయారు చేసే ప్రయోగాన్ని వివరిస్తున్న విద్యార్థులు, పక్కన ఉపాధ్యాయురాలు

విజ్ఞానం పెరుగుతుంది

ప్రభుత్వం ఇటువంటి ప్రదర్శనలు ఏర్పాటు చేయటం వల్ల పిల్లలకు విజ్ఞానం పెరుగుతుంది. మా పాఠశాలలో మొదటి నుంచే పిల్లలను ఇటువంటి ప్రయోగాలు నేర్చుకునేలా ప్రోత్సహిస్తున్నాం. గద్వాలలో నిర్వహించిన ఈ వైజ్ఞానిక ప్రదర్శనకు నాలుగు రకాల ప్రయోగాలతో విద్యార్థులు పాల్గొనేలా చర్యలు తీసుకున్నాము. ప్రదర్శనలో చిన్నారులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు.

- ఎల్లస్వామి, బయాలజీ ఉపాధ్యాయుడు, మార్లబీడు, ధరూరు

ఎంతో ఉపయోగపడతాయి

పాఠశాల స్థాయిలో ఇటువంటి విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించడం వల్ల వాటి ఫలితాలు భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడతాయి. సైన్స్ అన్నది ప్రతీ వ్యక్తికి చాలా అవసరం. నేడు సమాజంలో జరుగుతున్న అన్ని కార్యక్రమాలు కూడా సైన్స్‌కు లోబడి జరుగుతున్నవే. దీనికి తోడు నేడు టెక్నాలజీని ఉపయోగించుకుని ఎన్నో అద్భుతాలు చేసే అవకాశం ఉంది.

- జానకమ్మ, ఫిజికల్‌సైన్స్ ఉపాధ్యాయురాలు, అనంతపురం, గద్వాల

302 పాఠశాలలు పాల్గొన్నాయి

విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలల వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా వ్యాప్తంగా 302 పాఠశాలలు పాల్గొన్నాయి. ఇందులో వివిధ రకాల 248 ప్రయోగాలను విద్యార్థులు ప్రదర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల వినూత్నమైన పరికరాలను ప్రదర్శించారు. జిల్లాలోని అందరు ఉపాధ్యాయులు చాలా చక్కగా పని చేయటం వల్ల ఈ మేళా విజయవంతమైంది.

- మహమ్మద్ అబ్దుల్ ఘనీ, డీఈవో, గద్వాల

ప్లాస్టిక్‌ను తిరిగి వాడొచ్చు

ధరూరు మండలం మార్లబీడు ప్రభుత్వ పాఠశాల చిన్నారులు ప్లాస్టిక్ వ్యర్థాలతో కర్బన టైల్స్ తయారు చేసే విధానంపై అద్భుత ప్రదర్శన ఇచ్చారు. రోజూ వాడే ఎన్నో రకాల ప్లాస్టిక్ వస్తువులు వాడి పడేస్తుంటాం. అటువంటి ప్లాస్టిక్ వస్తువులను తిరిగి ఉపయోగించి టెక్నాలజీ సాయంతో గృహ నిర్మాణాలలో ఉపయోగించే కర్బన టైల్స్ తయారు చేసే విధానాన్ని బాగా వివరించారు. వ్యర్థ పదార్థాలను ఉపయోగించి మానవులకు ఉపయోగపడే ఎటువంటి వస్తువులను తయారు చేయవచ్చో కూడా చెప్పారు.

చెరకు పిప్పితో శానిటరీ ప్యాడ్స్ తయారీ

గద్వాల మండలం అనంతపురం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు వినూత్న ప్రయోగాన్ని ప్రదర్శించారు. చెరకు పిప్పిని ఉపయోగించి శానిటరీ ప్యాడ్స్‌ను తయారు చేసే విధానాన్ని వివరించారు. అంతే కాకుండా చెరకు పిప్పి, నారింజ తొక్కలతో పంట పొలాలకు కావలసిన మల్చింగ్‌ను ఏర్పాటు చేసుకునే విధానాన్ని తెలిపిన చిన్నారుల మేధాశక్తిని పలువురు అభినందించారు. దీంతో పాటు వ్యవసాయ పనులకు ఉపయోగించుకునే సోలార్ పరికరం తయారీ గురించి కూడా విద్యార్థులు ప్రదర్శించారు. ఈ పరికరంతో పొలాన్ని దున్నటం, చదును చేయటం, విత్తనాలు నాటడం, గడ్డికోయటం వివరించిన తీరు ఆకట్టుకుంది.



ప్రదర్శనను తిలకించడానికి బారులు తీరిన విద్యార్థులు



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

సింగోటంలో ఉచిత వైద్య శిబిరం

కొల్లాపూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం గ్రామంలో ఆదివారం పరవస్తు ఫౌండేషన్ చైర్మన్ మధుకర్ స్వామి మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరాన్ని పరవస్తు ఫౌండేషన్ చైర్మన్ మధుకర్ స్వామి ప్రారంభించారు. పరవస్తు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సింగోటం గ్రామంలో కార్పొరేట్ ఆసుపత్రి వైద్యులచే వివిధ రకాల రోగాలకు చికిత్సలు చేశారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ సహకారంతో మహిళలకు క్యాన్సర్ స్ర్కీనింగ్ ఉచితంగా చేశారు. లయన్స్ క్లబ్ సహకారంతో కంటి పరీక్షలు నిర్వహించారు. ఖర్చుతో కూడిన వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అవసరమైన రోగులకు మందులు అందజేశారు. పరవస్తు ఫౌండేషన్ చైర్మన్ మధుకర్ స్వామి పుట్టిన రోజు వేడుకలు వైద్య శిబిరంలో ఘనంగా నిర్వహించారు. పోలీస్ శాఖలో నిజాయితీగా పని చేస్తూ యువతను చెడు మార్గాలలోకి వెళ్లకుండా మార్గదర్శిగా నిలిచి స్వచ్ఛంద సంస్థ నెలకొల్పి సేవలు అందిస్తున్న పోలీస్ అధికారి మధుకర్ స్వామిని అభినందించారు.



అమరచింతలోని యూనియన్ బ్యాంకు

పోలీసుల అదుపులో బ్యాంకు దొంగలు!

అమరచింత, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : అమరచింత యూనియన్ బ్యాంకులో గత నెల 30వ తేదీన చొరబడిన దొంగలను పోలీసులు అదుపులో తీసుకున్నట్లు తెలిసింది. పట్టణంలోని యూనియన్ బ్యాంకు వెనుక భాగంలోని కిటికీ నుంచి లోపల చొరబడిన దొంగలు బ్యాంకులోని స్ట్రాంగ్ రూమ్ తెరిచి లాకర్లో ఉన్న బంగారు డబ్బులు దొంగిలించడానికి విఫల యత్నం చేసి చివరకు లాకర్ గది తెరవడానికి రాకపోవడంతో పరారైన ఘటన పాఠకులకు విదితమే. ఈ ఘటన జరిగిన వారంలోపే జిల్లా పోలీస్ యంత్రాంగం ఛాలెంజ్‌గా తీసుకొని ఈ ఘటనకు సంబంధించిన దొంగలను పట్టుకున్నట్లు తెలిసింది. తాజాగా ఈ దొంగల ముఠాలో ఒక మహిళ ఉందన్న ప్రచారం జోరుగా కొనసాగింది. పట్టుబడిన దొంగలకు అమరచింత పోలీస్ స్టేషన్ నుంచి ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి, జిల్లా కేంద్రానికి తరలించినట్లు సమాచారం. అందుకు సంబంధించిన పూర్తి వివరాలను సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలో మీడియా ముందు ప్రవేశ పెట్టనున్నట్లు తెలిసింది. ఏదేమైనా జిల్లాలోనే సంచలనం సృష్టించిన అమరచింత యూనియన్ బ్యాంకులో దొంగలు చొరబడిన ఘటనను ఎస్పీ రావుల గిరిధర్ సవాల్‌గా తీసుకుని అమరచింత యూనియన్ బ్యాంకును సందర్శించి జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తం చేసి, ఇందులో పాలుపంచుకున్న ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

మైసమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్రత్యేక పూజలు చేసిన వనపర్తిఎమ్మెల్యే మేఘారెడ్డి



నాయినోనిపల్లి మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేస్తున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

పెద్దకొత్తపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలంలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో మైసమ్మ దేవత దర్శనం కోసం ఆదివారం భక్తులు పోటెత్తారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 20వేల మంది దాకా భక్తులు మైసమ్మ దేవతను దర్శనం చేసుకుని తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. భక్తుల నుంచి హుండీ ద్వారా రూ. 89,164, టికెట్ల ద్వారా రూ. 40,785 మొత్తం రూ. 1,29,949 ఆదాయం వచ్చినట్లు చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, ఈవో రామేశ్వర్‌శర్మ తెలిపారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌యాద్, దేవదాయ శాఖ అధికారులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. పూజ కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి ఎస్ఐ సతీష్, మండల కోఆప్షన్ సభ్యులు ఎండీ సలీం, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తిమ్మాజిపేటలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తిమ్మాజిపేట జడ్పీహెచ్ఎస్‌లో 2008-09 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తిమ్మాజిపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో 2008-09 పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం జడ్పీహెచ్ఎస్ ఆవరణలో పెద్ద ఎత్తున హాజరై ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకుని వివిధ హోదాలలో ఉన్న వారందరూ 16ఏళ్ల తర్వాత ఒక చోట చేరుకొని చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అందరం కలిసి ఒక ట్రస్టు ఏర్పాటు చేసుకోవాలని, దాని ద్వారా ఎవరైనా తమతోపాటు చదువుకుని అకస్మాత్తుగా మృతి చెందిన అదేవిధంగా నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయం తీసుకున్నారు. అంతకు ముందు తమకు విద్యనందించి ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

సబ్‌స్టేషన్ కోసం నిరీక్షణ



కర్నెతండా ఎత్తిపోతల పథకం పంప్ హౌస్

ఖిల్లాఘణపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎత్తైన ప్రాంతాల్లోని భూములకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేయాలని గతంలో కర్నె తండా ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించి 95 శాతం పూర్తి చేశారు. సాగునీరు ఎత్తిపోయడానికి సబ్‌స్టేషన్ కోసం నిరీక్షిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం కర్నె తండా లిఫ్టు కోసం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం మిట్యా తండా వద్ద సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం ఒక కోటి 63లక్షల 55 వేల రూపాయలు మంజూరు చేసింది. సబ్ స్టేషన్ టెండర్ పూర్తయిన తరువాత పనులు ప్రారంభించే అవకాశం ఉంది. కర్నె తండా లిఫ్టు ద్వారా నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని 851 ఎకరాలు, వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం, పెద్దమందడి మండలాల్లోని 3,384 ఎకరాలు ఎత్తైన ప్రాంతాలలోని మొత్తం 4,235 ఎకరాల భూమి సాగులోకి రానున్నది.

కర్నె తండా లిఫ్టు పనులు పూర్తి

కర్నె తండా లిఫ్టు కోసం 23 మీటర్ల ఎత్తులో పంప్ హౌస్ నిర్మాణం చేపట్టి సాగునీటిని ఎత్తిపోయడానికి 800 కేవీ మెగా వాట్స్ గల రెండు పెద్ద మోటార్లను ఏర్పాటు చేసి షట్టర్లు బిగించారు. ఘణపురం బ్రాంచ్ కెనాల్ 7.3 కిలోమీటర్ల వద్ద ముందరి తండా మైసమ్మ చెరువును కేఎల్ఐ నీటితో నింపి 1.5 కిలోమీటర్ల అప్రోచ్ కెనాల్‌తో పంప్ హౌస్‌కు నీటిని మళ్లించడానికి కాల్వల నిర్మాణం పూర్తయింది. పంప్ హౌస్‌లోని రెండు మోటార్ల సహాయంతో నీరు ఎత్తిపోయడానికి మూడు ఫీట్ల డయా పైపులను 2.5 కిలోమీటర్ల దూరం మేరకు పైప్‌లైన్‌ను వేసి సిద్ధం చేశారు. అక్కడి నుంచి లట్టుపల్లి కెనాల్ 4.5 కి.మీ. షాపూర్ కెనాల్ 4.8 కి.మీ తవ్వకాలు జరిపి నిర్మాణం పూర్తి కాగా జంగమాయపల్లి 3.5 కి.మీ షాపూర్ కెనాల్ పరిధిలో అటవీ శాఖ భూములు ఉండడంతో అనుమతులు రాకపోవడంతో కాల్వ నిర్మాణం నిలిచిపోయింది. ఇప్పటికే లిఫ్టు పనుల్లో భాగంగా మేజర్, మైనర్, సబ్‌మైనర్ కాల్వల నిర్మాణం మొత్తం 16,600 కి.మీ పూర్తి చేసి సుమారు 40 ఫీడర్ ఛానళ్లు నిర్మించారు. సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయిన వెంటనే ఎత్తిపోతల పథకం ద్వారా నీరు ఎత్తిపోయడానికి సిద్ధంగా ఉంచారు.

కర్నె తండా ఎత్తిపోతల పథకం పనులు పూర్తయిన నేపథ్యంలో సబ్ స్టేషన్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం భీముని తండా, మిట్యా తండా, లట్టుపల్లి తండాలు, వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని కర్నె తండా, ఆముదం బండతండా, గార్లబండతండా, షాపూర్, దొంతికుంట తండా, మామిడిమాడ వెనికి తండా, ముందరితండా, రుక్కన్నపల్లి, కోతులకుంట తండా, ఉప్పరిపల్లి, పెద్దమందడి మండలంలోని జంగమాయపల్లి ఎత్తయిన ప్రాంతాల్లోని గిరిజన తండాల భూముల ఆయకట్టు రైతులకు సాగునీరు అందుబాటులోకి తేవాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

త్వరగా సాగునీరు అందించాలి



కర్నెతండా లిఫ్టు పనులు పూర్తయిన నేపథ్యంలో సబ్ స్టేషన్ నిర్మాణం కోసం టెండర్ల ప్రక్రియ చేపట్టి పనులను త్వరితగతిన పూర్తి చేసి ఎత్తయిన ప్రాంతాలకు సాగునీరు అందించాలి. ఎత్తిపోతల పథకంతో బీడు భూములు సైతం సాగులోకి వస్తాయని కొండంత ఆశతో ఎదురుచూస్తున్నాం.

- పీనా నాయక్, మాజీ సర్పంచ్, దొంతికుంట తండా

వానకాలం నాటికి సాగునీటి సరఫరా



కర్నెతండా లిఫ్టు ద్వారా ఎత్తయిన ప్రాంతాల్లోని భూములకు వానకాలం సీజన్ నాటికి సాగునీరు అందించడానికి చర్యలు చేపడుతున్నాం. పంప్‌హౌస్‌లో మోటార్లు, షట్టర్లను బిగించి కాల్వల నిర్మాణం చేపట్టడంతో 95 శాతం లిఫ్టు పనులను పూర్తి చేశారు. సబ్ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరైన నేపథ్యంలో పనులు వేగవంతంగా కొనసాగుతాయి.

- నరేందర్ రెడ్డి, ఇరిగేషన్ డీఈ, వనపర్తి

అమ్మకానికి టెక్నికల్ పోస్టులు

గద్వాల క్రైం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో ప్రారంభమైన ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 32 టెక్నికల్ పోస్టుల భర్తీకి ఇటీవలే కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న 16 మందిని మెడికల్ కళాశాలలోకి మార్చేందుకు రెండు రోజుల క్రితం జిల్లా ఉపాధి కల్పనాధికారి ఆధ్వర్యంలో సర్టిఫికెట్ల పరిశీలన గుట్టు చప్పుడు కాకుండా నిర్వహించారు. మెడికల్ కళాశాలలో ఉన్న ఒకరు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేయని ముగ్గురిని తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరు రోగులకు మధ్యాహ్న భోజనం అందించే వారు కావడం విశేషం. వీరు ఒక్కొక్కరు రూ. లక్ష దాకా ముడుపులు ఇచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే ఇద్దరు సిబ్బంది కూడా కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఏది ఏమైనా అనర్హులు ముడుపులు ఇస్తే అర్హులుగా మారే అవకాశాలు ఉన్నాయని ఆరోపిస్తున్నారు.

అలంపూర్ పోకుండా ఉండేందుకే..

ప్రస్తుతం తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో ఉన్న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ కళాశాల ఏర్పడిన తర్వాత సార్వజనిక ప్రభుత్వ ఆసుపత్రిగా మారాల్సి ఉంది. ఇలా మారడం వల్ల ఇక్కడ పనిచేసే టెక్నికల్ సిబ్బంది అలంపూర్‌కు బదిలీ కావాల్సి వస్తుంది. ఇలా బదిలీ నుంచి తప్పించుకోవడానికి ఈ 16 మంది ఇలా మెడికల్ కళాశాల సిబ్బంది ఆధ్వర్యంలో ఈ 16 మంది ముడుపులు ఇచ్చి మెడికల్ కళాశాల సిబ్బందిగా మారేందుకు అవతారం ఎత్తినట్లు తెలుస్తోంది.

కీలక పాత్ర పోషిస్తున్న సిబ్బంది

మెడికల్ కళాశాలలో టెక్నికల్ పోస్టుల కోసం కలెక్టర్ అనుమతి ఇచ్చారు. కానీ ఓ సిబ్బంది దీనిని తమకు అనుకూలంగా మార్చుకొని కొత్తవారిని కాకుండా పాత వారినే నియమించేందుకు పూనుకున్నారు. వారినుంచి ముడుపులు కూడా తీసుకుంటున్నట్లు ఇప్పుడు జిల్లా అంతటా చర్చనీయంగా మారింది. ఈ విషయంపై స్థానిక ప్రజాప్రతినిధులకు తెలిసినా ఏమీ చేయలేని స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయంపై విచారణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

అధికారుల ఆదేశం మేరకు ధ్రువపత్రాలు పరిశీలించాం



కలెక్టర్ ఆదేశాల మేరకు తనకు పేర్లు ఇచ్చిన వారి ధ్రువపత్రాలను మాత్రమే పరిశీలించాం. ఇందులో జరిగిన అవకతవకలపై నాకు ఎలాంటి సమాచారం లేదు. ఇందులో ఎవరు ఉన్నారో... ఎవరు లేరో తనకు తెలియదన్నారు. ఈ విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాను.

- డాక్టర్ ప్రియాంక, జిల్లా ఉపాధి కల్పనాధికారి

ఆలయాల ద్వారా ఐక్యత పెంచుకోవాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవిదేవి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవీదేవి

కందనూలు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆలయాలు, ప్రార్థన స్థలాలు ప్రజల్లో ఐకమత్యాన్ని పెంపొందించే వేదికలని, పురాతన ఆలయాలను కాపాడుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తంగిరాల మాధవీదేవి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీపురం గ్రామంలోని పురాతన శ్రీరంగనాయకస్వామి ఆలయం వారు తయారు చేయించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాధవిదేవి ఆదివారం ఆవిష్కరించారు. హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని తమ నివాసంలో ఆమె క్యాలెండర్ ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. భారతీయ సంస్కృతిలోనే అన్ని మతాలను గౌరవిస్తూ తమ మతాన్ని పాటించాలని సిద్ధాంతం ఉన్నారు. పురాతన ఆలయాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు ప్రజల్లో ఐకమత్యాన్ని పెంపొందించేలా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సూచించారు. జనవరి 13న ఆలయంలో నిర్వహించనున్న గోదాకల్యాణం వేడుకకు హాజరు కావాలని ఆలయ కమిటీ ప్రతినిధులు జస్టిస్ మాధవిదేవికి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది టి.హనుమంతురెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు మల్లికార్జున్, సునీల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వట్టెం వెంకన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు

బిజినేపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వట్టెం వేంకటేశ్వర స్వామి ఆలయంలో త్రిదండి దేవనాథ రామానుజ జియర్ స్వామి ధనుర్మాసం పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన జియర్ స్వామిని ఆలయ ధర్మకర్తలు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ధనుర్మాసంలో స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తే విశేష ఫలితం దక్కుతుందని భక్తులకు వివరించారు. అనంతరం ఉమ్మడి జిల్లా వికాస తరంగిణి సభ్యుల సమావేశంలో పాల్గొని వికాస తరంగిణి ఆధ్వర్యంలో భవిష్యతులో చేపట్టబోయే కార్యక్రమాలను, విధులను సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్త సందడి ప్రతాప్‌రెడ్డి, సభ్యులు గుబ్బ సత్యనారాయణ, తూం రవీందర్ రెడ్డి ఉన్నారు.

ఇలపై మెరిసిన రంగవల్లులు

- ఆకర్షణీయమైన ముగ్గులు వేసి.. ఆలోచింపజేసిన మహిళామణులు
- మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో నిర్వహణ
- ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన

సంక్రాంతి కళ ముందే వచ్చేసింది.. రంగవల్లులు నేలపై పరుచుకుని పలువురి మెప్పు పొందాయి. మహిళామణులు ఆకర్షణీయమైన ముగ్గులు వేసి చూపరులను మంత్రముగ్ధులను చేశారు..మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో ఆదివారం ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి.

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్, సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పెర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో నిర్వహించింది. ఈ పోటీల్లో వనితలు ఉత్సాహంగా పాల్గొని రంగుల హరివిల్లును ఇలపై పరిచారు. ముగ్గుల ఎంపికలో న్యాయనిర్ణేతలు చాకచక్యంగా వ్యవహరించారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా ఆరు వేలు, రెండో బహుమతిగా నాలుగు వేలు, మూడో బహుమతిగా మూడు వేల నగదును అందజేశారు.


మహబూబ్‌నగర్‌లో స్పాన్సర్స్ ముగ్గులు వేస్తున్న మహిళలు

మహబూబ్‌నగర్


మహబూబ్‌నగర్‌లో ముత్యాల ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత శుభాంగి పాటిల్


మహబూబ్‌నగర్‌లో ముత్యాల ముగ్గుల పోటీల్లో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత శిల్పారెడ్డి


మహబూబ్‌నగర్‌లో ముత్యాల ముగ్గుల పోటీల్లో తృతీయ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత సుమిత్ర

నారాయణపేట


నారాయణపేటలో ముత్యాల ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత బొంబాయి విద్య


నారాయణపేటలో ముత్యాల ముగ్గుల పోటీల్లో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత సుష్మ


నారాయణపేటలో ముత్యాల ముగ్గుల పోటీల్లో తృతీయ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత బుగ్గమ్మ


నారాయణపేటలో ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు


ఆకట్టుకున్న మహబూబ్‌నగర్‌లోని రిషి జూనియర్ కళాశాల పేరిట ముగ్గు

విజేతల అభిప్రాయాలు

● సంతోషంగా ఉంది

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి పొందడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో పాల్గొని బహుమతి పొందాలని ఉంది. గత 16 ఏళ్లుగా ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. నిర్వాహకుల సహకారం బాగా ఉంది. ఇదే స్థాయిలో మును ముందు ముగ్గుల పోటీలు నిర్వహిస్తే చాలామంది మహిళలు, విద్యార్థినులు పాల్గొనే అవకాశం ఉంది.

- శుభాంగి పాటిల్, ప్రథమ బహుమతి విజేత, మహబూబ్‌నగర్

● గత ఆరేళ్లుగా పాల్గొంటున్నాను..

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహించే ముగ్గుల పోటీల్లో గత ఆరేళ్లుగా పాల్గొంటున్నాను. కొవిడ్‌కు ముందు, కొవిడ్ తర్వాత నిర్వహించిన పోటీల్లో పాల్గొని బహుమతులు పొందాను. నేటి పోటీల్లో చిన్నతప్పిదం వల్ల ప్రథమ బహుమతిని కోల్పోయాను. వచ్చే సంవత్సరం నిర్వహించే పోటీల్లో ప్రథమ బహుమతి సాధించేలా ముగ్గు వేస్తాను. నాకు అవకాశం కల్పించిన ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

- శిల్పారెడ్డి, ద్వితీయ బహుమతి విజేత, మధురానగర్ కాలనీ, మహబూబ్‌నగర్

● ఆనందంగా ఉంది

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ సంస్థలు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొని బహుమతి పొందడం ఎంతో ఆనందంగా ఉంది. గతంలో వివిధ సంస్థలు నిర్వహించిన పోటీల్లో పాల్గొని బహుమతులు పొందాను. అప్పటి జిల్లా కలెక్టర్ టీకే శ్రీదేవితో బహుమతి పొందడం తర్వాత తిరిగి ముగ్గుల పోటీల్లో బహుమతి పొందడం ఇదే ప్రథమం. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేలా ముగ్గులు వేసేందుకు యత్నిస్తాను.

- సుమిత్ర, తృతీయ బహుమతి విజేత, శివశక్తినగర్, మహబూబ్‌నగర్

● మొదటిసారి పాల్గొన్నా..

నేను మొదటిసారిగా ఈ పోటీల్లో పాల్గొన్నాను. నారాయణపేటలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో శక్తిపీఠం సహకారంతో నిర్వహించిన సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి రావడం ఆనందంగా ఉంది. ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి వస్తుందని అనుకోలేదు. ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసి ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు.

- బొంబాయి విద్య, తొమ్మిదవ తరగతి, ప్రథమ బహుమతి, నారాయణపేట

● చుక్కల ముగ్గులు అంతరించి పోతున్నాయి..

చుక్కల ముగ్గులు అంతరించిపోతున్న తరుణంలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో శక్తి పీఠం సహకారంతో చుక్కల ముగ్గుల పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉంది. అంతరించి పోతున్న మన సంస్కృతీ సంప్రదాయాలను వెలికితీసేందుకు ప్రయత్నం చేస్తుండటం అభినందనీయం. ముగ్గుల పోటీలు నిర్వహించడం వల్ల నాలాంటి యువతులు ముందుకు వస్తున్నారు. ఈ పోటీల్లో రెండవ బహుమతి రావడం సంతోషంగా ఉంది.

- సుష్మ, పీజీ సెకండ్ ఇయర్, నారాయణపేట

● మహిళలను ప్రోత్సహిస్తున్నారు..

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో శక్తిపీఠం సహకారంతో చుక్కల ముగ్గుల పోటీలతో మంచి సంప్రదాయానికి నాంది పలికి మహిళలను ప్రోత్సహించడం అభినందనీయం. పోటీల నిర్వహణతో మహిళల్లో ఉత్సాహాన్ని నింపుతుంది. నాకు మూడో బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ ముగ్గుల పోటీలు సంక్రాంతి ముందు నిర్వహించినందుకు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్, శక్తిపీఠంకు ధన్యవాదాలు.

- బి. బుగ్గమ్మ, తృతీయ బహుమతి, నారాయణపేట

- మహబూబ్‌నగర్‌న్యూటౌన్/నారాయణపేట, (ఆంధ్రజ్యోతి)


నారాయణపేటలోని శక్తిపీటం ఆవరణలో ముగ్గులు వేస్తున్న మహిళలు

సిమెంట్ ట్యాంకరును ఢీకొట్టిన కారు

ఇద్దరి దుర్మరణం


శాంపూరి గణేష్ (ఫైల్)


రామకోటి (ఫైల్)

చారకొండ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని జూపల్లి సమీపంలో జడ్చర్ల-కోదాడ జాతీయ రాహదారిపై ఆదివారం రాత్రి చోటు చేసుకొంది. ఎస్ఐ శంషోద్దీన్ వివరాల ప్రకారం.. వెల్దండ మండలం కొట్ర గ్రామానికి చెందిన శాంపూరి గణేష్ (30), కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామానికి చెందిన కేతమల్ల రామకోటి (36)లు హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పీఆర్వోలుగా పనిచేస్తున్నారు. గణేష్ కల్వకుర్తి ప ట్టణంలో, రామకోటి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. రామకోటి తన పెళ్లి చూపుల కోసం స్నేహితుడు గణేష్‌ను తీసుకొని కారులో వెళ్లి తిరిగి వస్తుండగా ముందు వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ (లారీ)ని వెనకనుంచి కారు వేగంగా ఢీకొట్టింది. లారీ కింది భాగంలోకి కారు వెళ్లింది. అది గమనించని లారీ డ్రైవర్ సుమారు కిలో మీటర్ మేర ముందుకు దూసుకెళ్లడంతో పెద్ద శబ్దం వచ్చింది. దీంతో లారీని నిలిపి చూడగా అప్పటికే కారు నుజ్జు నుజ్జు అయినట్లు గుర్తించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చారకొండ, వంగూరు ఎస్ఐలు శంషోద్దీన్, మహేందర్‌లు తమ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలు చేపట్టారు. అప్పటికే ఇద్దరు మృతి చెందారు. మృతదేహాలను అతికష్టం మీద బయటకు తీశారు. నిలిచిపోయిన ట్రాఫిక్‌ను నియంత్రించి మృతదేహాలను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గణేష్‌కు భార్య శివలీల, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రామకోటికి తల్లిదండ్రులతో పాటు ఇద్దరు అన్నదమ్ములున్నారు.

కోనేరులో గల్లంతైన

యువకుడి మృతదేహం వెలికితీత

ధన్వాడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ధన్వాడ వేంకటేశ్వర స్వామి కోనేరులో శనివారం రాత్రి గల్లంతైన యువకుడు మృతదేహాన్ని ఆదివారం వెలికి తీశారు. ధన్వాడకు చెందిన బాలస్వామి (27) అనే యువకుడు రాత్రి సమయంలో కోనేరులో గల్లంతు అయ్యాడు. యువకుడిని వెలికి తీయడం కోసం తెల్లవార్లు అగ్నిమాక సిబ్బంది కోనేరులో ఉన్న వాటర్ ఎత్తిపోశారు.

గంటల తరబడి వాటర్ ఎత్తిపోశారు. పోలీసులు, అగ్నిమాక సిబ్బంది దగ్గరుండి గాలింపు జరిపారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకూమార్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

రాజాపూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి శుక్రవారం అదృశ్యమైనట్లు ఎస్సై కే రవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బీటెక్ చదువుతున్న యువతి హైదరాబాద్ నగరంలో కాలేజీకి వెళ్తున్నానంటూ ఇంట్లో చెప్పి వెళ్లినట్లు, అక్కడ కాలేజీలో లేకపోవడం, రెండు రోజులు అయినా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, తల్లి రాజాపూర్, హైదరాబాద్, షాద్‌నగర్, బాలానగర్‌లో పరిసర ప్రాంతాల్లో, తమ బంధువుల వద్దకు వెళ్లి వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం యువతి తల్లి సిద్దిపేట నివాసిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తెలకపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలోని పశువుల సంత సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

బల్మూరు మండలం కొండారెడ్డిపల్లికి చెందిన శీలం రాములు (48) అనే వ్యక్తి తెలకపల్లి నుంచి బైకుపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వైకుంఠ రథాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. వైకుంఠ రథాన్ని రాజు అనే వ్యక్తి డ్రైవింగ్ చేస్తున్నాడు. జరిగిన సంఘట నపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీరంగాపురం ఆలయానికి

ఈవో లేక భక్తుల అగచాట్లు

శ్రీరంగాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దినదినాభివృద్ధి చెందుతున్న శ్రీరంగనాయక స్వామి ఆలయంలో ఈవో లేక భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మూడేళ్ల క్రితం రంగారెడ్డి జిల్లాకు చెందిన శేఖర్ గౌడ్ అనే ఉద్యోగిని శ్రీరంగానాథ స్వామి ఆలయానికి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించారు.

అప్పటి ప్రభుత్వం ఈవోను తాండూర్ ప్రాంతంలోని మరికొన్ని ఆలయాలకు ఇన్‌చార్జిగా నియమించింది. పని ఒత్తిడి వల్ల శ్రీరంగాపురానికి రాలేకపోతున్నాడని తెలిసింది. నెలకోసారి ముఖ్య పూజల సందర్భంగా హుండీ లెక్కింపునకు మొక్కుబడిగా వచ్చిపోతున్నారు. దీంతో ఆలయంలో ప్రతిరోజు సమస్యలు నెలకొన్నాయి. ఇటీవల ఆలయానికి భక్తుల సందడి ఎక్కువైంది. దీంతో వారు చాలా సమస్యలతో సతమతమవుతున్నారు. కలెక్టర్ స్పందించి పూర్తి స్థాయి ఈవోను నియమించి ఆలయంలో సమస్యలను పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు. దీంతో పాటు ఈ నెల 10న వైకుంఠ ఏకాదశి కార్యక్రమం ఈ ఆలయంలో ఘనంగా జరుగుతుంది. ఈ కార్యక్రమానికి దాదాపుగా పది వేల మంది భక్తులు హాజరవుతారు. ప్రతీ ఏటా వైకుంఠ ఏకాదశికి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆలయ ఈవోను మార్చి సమస్యలు పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు.

కూతురికి నివాళులర్పించడానికి వచ్చిన తల్లి మృతి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

శ్రీరంగాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ముంత లక్ష్మి ప్రమాదవశాత్తు భీమా కాలువలో జారిపడి మృతి చెందింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ముంత లక్ష్మి, భర్త కురుమూర్తితో కలిసి హైదరాబాద్‌లో జీవనం కొనసాగిస్తున్నారు. ఈమెకు ఇద్దరు కూతుర్లు. మొదటి కూతురు అనారోగ్యంతో ఏడాది క్రితం మృతి చెందింది. సంవత్సరికం సందర్భంగా కూతురికి నివాళులర్పించడానికి శ్రీరంగాపురానికి ఆమె సోదరుడితో కలిసి వచ్చింది. కూతురు సమాధికి పూలమాల వేసింది. పూజా కార్యక్రమానికి అగ్గిపెట్ట అవసరం ఉండగా, సోదరుడు అగ్గిపెట్ట తీసుకోవడానికి శ్రీరంగాపురం గ్రామంలోకి వెళ్లాడు. మళ్లీ వచ్చేసరికి తన సోదరీ లేకపోవడంతో ఊరిలోకి వెళ్లిపోయాడు. ఆమె సమీపంలో ఉన్న భీమా కాలువ వద్దకు వెళ్లి కాళ్లు కడుక్కునే ప్రయత్నంలో కాలుజారి కాలువలో పడిపోయింది. పక్కనే ఉన్న కరెంటు మోటారుకు సంబంధించిన వైరు నీటిలో ఉంది. కరెంటు వైర్‌ను ప్రాణాలు దక్కించుకునేందుకు పట్టుకుంది. ఈ క్రమంలో వైర్ తెగిపోయి ఆమెకు షాక్ తగిలి మృతి చెందింది. శనివారం సాయంత్రం కాలువలో కనిపించింది. మృతదేహాన్ని బయటకు తీసి తాము పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆదివారం ఉదయం పోస్టుమార్టం కోసం వనపర్తి ఆస్పత్రికి తరలించారు. అనంతరం అంత్యక్రియలు జరిగాయి. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎం. రాజేంద్రప్రసాద్ యాదవ్ ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాము యాదవ్, నాయకులు మహేష్ గౌడ్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి కరాటే టోర్నీలో విద్యార్థుల ప్రతిభ


జాతీయ స్థాయి కరాటే టోర్నీలో పతకాలు సాధించిన విద్యార్థులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో హనుమాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు భవాని, చందువర్ధన్, వరుణ్‌కుమార్, చంద్రమోహన్, సంపత్‌కుమార్ వివిధ విభాగాల్లో పతకాలు సాధించినట్లు అసోసియేషన్ ఫౌండర్ వెంకటేశ్ తెలిపారు. వరంగల్‌లో ఆదివారం జరిగిన రాజీవ్‌గాంధీ మెమోరియల్ నేషనల్ కరాటే చాంపియన్‌లో వారు పాల్గొని ప్రతిభ చాటారన్నారు.

ఇంటర్వ్యూ..

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

- నరసింహులు, మండల పంచాయతీ అధికారి, బిజినేపల్లి

బిజినేపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సర్పంచుల పదవీ కాలం ముగిసి ఏడాది కావస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన తీసుకొచ్చింది. మండల స్థాయి అధికారులను గ్రామ ప్రత్యేక అధికారిగా నియమించి పంచాయతీ కార్యదర్శులతో గ్రామ పాలన కొనసాగిస్తున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లో సమస్యల పట్ల అధికారుల పనితీరుపై మండల పంచాయతీ అధికారి నరసింహులును 'ఆంధ్రజ్యోతి' పలకరించగా పలు విషయాలు వివరించారు



ప్రత్యేక అధికారుల పాలనతో అధికారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి?

ప్రభుత్వం సర్పంచుల ఎన్నికల నిర్వహించే వరకు ప్రత్యేక అధికారుల పాలనతో గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అందిస్తున్న సేవలను, సంక్షేమ పథకాల ఫలాలను ప్రజల చెంతకే ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అందించేలా చర్యలు తీసుకున్నాం.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో పారిశుధ్య పనులు సాగడం లేదని విమర్శలు వస్తున్నాయి?

కేంద్రం ప్రభుత్వం నుంచి 15వ ఫైనాన్స్ నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు సకాలంలో రావడం లేదనేది వాస్తవమే. కానీ, గ్రామాల్లో చేపట్టాల్సిన పారిశుధ్య పనులు, వీధిలైట్ల పునరుద్ధరణ, మురుగునీరు శుభ్రత, తాగునీటి సరఫరా వంటి పనులకు ఎక్కడ కూడా ఆటకం కల్గకుండా కొనసాగిస్తున్నాం.

అందుబాటులోకి ఆధునిక గ్రంథాలయం

- జిల్లా గ్రంథాలయం నేడు ప్రారంభం
- అధునాతన హంగులతో నిర్మాణం
- పాఠకులకు అందుబాటులోకి..

నాగర్‌కర్నూల్‌టౌన్, జనవరి5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయాల సంస్థ నూతన భవనం నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. జిల్లా కేంద్రంలోని బస్ డిపోకు సమీపంలో ప్రధాన రహదారి పక్కన రూ.2 కోట్ల నిధులతో ఆధునిక హంగులతో నూతన భవనం నిర్మించారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ నూతన భ వన నిర్మాణానికి 2022 జూన్ 18న శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. వివిధ కారణాల చేత నిర్మాణ పనులు దాదాపు రెండున్నర సంవత్సరాల పాటు కొనసా గాయి. అన్ని ఇబ్బందులను అధిగమించి ఎట్టకేలకు పనులు పూర్తి చేసుకుని త్వరలో పాఠకులకు అందుబాటులోకి వచ్చేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం కొనసాగుతున్న మునిసిపల్ కార్యాలయం పాత భవనం నుంచి జిల్లా గ్రంథాయాన్ని ఇక్కడికి తరలించేందుకు అధి కారులు సిద్ధమవుతు న్నారు.



ప్రారంభానికి సిద్ధమైన జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన భవనం

ప్రారంభించనున్న మంత్రి



జిల్లా గ్రంథాలయాల నూతన భవనాన్ని రాష్ట్ర టూరిజం, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ఈ రోజు ప్రారంభిస్తున్నాం. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రితో పాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నారు. ప్రారంభోత్సవ అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ పాలకమండలి ప్రమాణస్వీకారం కార్యక్రమం కూడా జరగనుంది. ఉదయం 11 గంటలకు జరుగునున్న ఈ కార్యక్రమానికి జిల్లాలోని విద్యావంతులు, మేధావులు హాజరై విజయవంతం చేయాలి.

- గంగాపురం రాజేందర్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్, నాగర్‌కర్నూల్

తప్పనున్న తిప్పలు

నాగర్‌కర్నూల్ పట్టణం గ్రామ పంచాయతీ నుంచి నగర పంచాయతీ, మునిసిపాలిటీగా మారడంతో పాటు జిల్లా కేంద్రంగా అవతరించినా గ్రంథాలయం మాత్రం సొంత భవనానికి నోచుకోలేదు. దశాబ్దాలుగా చాలీచాలని వసతులతో అద్దె భవనంలోనే కొనసాగుతూ వచ్చింది. జిల్లా గ్రంథాలయాల సంస్థ కోసం నిర్మించిన నూతన భవనంతో ఇన్నాళ్లకు పాఠకులకు ఆ ఇబ్బందులు తొలగనున్నాయి. రెండు ఫ్లోర్‌లలో నిర్మించిన జిల్లా గ్రంథాలయ సంస్థ భవనంలో మొదటి ఫ్లోర్‌లో దినపత్రికలు, మాసపత్రికలు చదివేందుకు విశాలమైన హాలుతో పాటు పుస్తకాల నిర్వహణకు గదులను నిర్మించారు. అదేవిధంగా రెండో ఫ్లోర్‌లో పోటీ పరీక్షలకు చదివే అభ్యర్థుల కోసం విశాలమైన హాలుతో పాటు డిజిటల్ లైబ్రెరీ నిర్వహణకు, జిల్లా గ్రంథాలయ సంస్థ పాలకమండలి కోసం గదులను నిర్మించారు. జిల్లా గ్రంథాలయానికి సొంత భవనం అందుబాటులోకి రానుండడంతో పాఠకులు, పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రైతు భరోసా ఎకరాకు రూ.15వేలు ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు

కందనూలు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన రైతు భరోసా హామీని వెంటనే అమలు చేయాలని, ఎకరాకు రూ.15వేలు చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వానాకాలం ముగిసి యాసంగి కాలం వచ్చినా ఇప్పటి వరకు రైతులకు రైతు భరోసా చెల్లించలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ.15వేలు రైతు భరోసా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసులు, దేశ్యనాయక్, ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాసులు, నరసింహ, డి.ఈశ్వర్, పొదిల రామయ్య, మల్లేష్, శంకర్‌నాయక్, శివవర్మ, కొంపల్లి అశోక్, నాగరాజు, దశరథం, బాలస్వామి, తారాసింగ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ముస్తాబవుతున్న శ్రీరంగనాయకస్వామి ఆలయం

కందనూలు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్ కర్నూల్ మండల పరిధిలోని శ్రీపురం గ్రామంలో వెలసిన శ్రీరంగనాయకస్వామి ఆలయం వైకుంఠ ఏకాదశి వేడుకలకు ముస్తాబు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకలకు ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డికి ఆదివారం ఆలయ కమిటీ నిర్వాహకులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అత్యంత పురాతన చరిత్ర కలిగిన వైష్ణవ దేవాలయం కావడంతో వైకుంఠ ఏకాదశి నాడు ఉత్తర ద్వార దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు.


వైకుంఠ ఏకాదశి వేడుకలకు ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

విశ్వకర్మ జాతీయ మహాసభ మండల కమిటీ ఎన్నిక


విశ్వకర్మ జాతీయ మహాసభ మండల కార్యవర్గం

పెద్దకొత్తపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారతీయ విశ్వకర్మ జాతీయ మహాసభ పెద్దకొత్తపల్లి మండలం నూతన కార్యవర్గం ఆదివారం మండల కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయంలో ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా పి.చంద్రశేఖర్‌ఆచారి, అధ్యక్షుడిగా కోలాటం మహేష్‌చారి, ఉపాధ్యక్షులుగా ఎల్లోజీ ప్రసాద్ చారి, కార్యదర్శిగా పసుపు నూరిరాజు, ప్రధాన కార్యదర్శిగా నారాయణదాసు నరసింహాచారి, సహాయ కార్యదర్శిగా పుట్టపాక రంగాచారి, సమన్వయకర్తగా గన్నోజు బ్రహ్మయ్యఆచారి, ముఖ్య సలహాదారుగా జనార్దన్‌చారి, సలహాదారుగా రామచంద్రయ్య ఆచారి ఎన్నికయ్యారు. నూతన కమిటీని శాలువాలు కప్పి సన్మానించారు.

క్రికెట్ టోర్నీ విజేత అచ్చంపేట



విజేతగా నిలిచిన అచ్చంపేట జట్టుకు కప్పును అందజేస్తున్న అపోలో సంస్థ ప్రతినిధులు

మన్ననూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : అపోలో టోటల్ హెల్త్ సంస్థ ఆధ్వర్యంలో అమ్రాబాద్ మండలం మన్ననూరు చింతల చెరువు క్రీడా మైదానంలో వారం రోజులుగా జరుగుతున్న నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం విజయవంతంగా ముగిసాయి. లీగ్ స్థాయిలో మాచ్‌లను నెగ్గి ఫైనల్‌కు చేరిన ప్రేమ్ క్రికెట్‌జట్టు అచ్చంపేట, దండోరా క్రికెట్ జట్టు అమ్రాబాద్‌ల మధ్యన హోరా హోరీగా జరిగిన మ్యాచ్‌లో అచ్చంపేట జట్టు విజయం సాధించి కప్పును కైవసం చేసుకుంది. రన్నరప్‌గా దండోరా అమ్రాబాద్ జట్టు నిలిచింది. విజేతగా నిలిచిన జట్టు రూ.2000, రన్నరప్ జట్టుకు రూ.10000 నగదును అందజేశారు. టోర్నమెంట్‌లో 36 జట్లు పాల్గొనగా, లాటరీ ద్వారా 8 జట్లను ఎంపిక చేసి క్రికెట్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో అపోలో టోటల్ హెల్త్ మేనేజరు హరిబాబు, అపోలో ఎగ్జిక్యూటివ్ జావేద్, అపోలో వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్, సింగిల్ విండో డైరెక్టర్ బుచ్చయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యులు దాసరి శ్రీనివాసులు, బాలమ్మ, కాంగ్రెస్ నాయకులు రహీం, రవికుమార్ పాల్గొన్నారు.

గొల్లవాగును చేపల చెరువుగా మార్చండి

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తా రవీందర్‌రావు

ఉప్పునుంతల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : గొల్లవాగును మత్స్యకారులకు చేపల చెరువుగా మార్చి ముదిరాజ్ కులస్తులకు జీవనోపాధి కల్పించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పెద్దాపూర్‌లోని గొల్లవాగుకు సమీపంలోని ముంపునకు గురవుతున్న ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేసి మత్స్యకారుల కోసం చేపల చెరువుకు కేటాయిస్తే వారు చేపలు పెంచుకొని జీవనోపాధి పొందుతారని అన్నారు. అంతే కాక మత్స్య కార్మికుల సంఘం ఏర్పాటు చేసుకొని ప్రభుత్వం నుంచి వస్తున్న సబ్సిడీ పథకాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఉందన్నారు.

న్యూస్ బాక్స్

నేడు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రమాణస్వీకారం

అచ్చంపేట టౌన్, జనవరి5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అచ్చంపేట ప్రాంతానికి చెందిన అడ్వకేట్ రాజేందర్ నేడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆదివారం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. నేడు జిల్లాలో జరిగే గ్రంథాలయ చైర్మన్ ప్రమాణస్వీకారానికి మంత్రులు, ఎమ్మెల్యేలను ఆహ్వానించానని తెలిపారు.

పీఆర్ఎల్ఐకి సూదిని జైపాల్‌రెడ్డి పేరు పెట్టడం గర్వకారణం

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి

కల్వకుర్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సూదిని జైపాల్‌రెడ్డి పేరు పెట్టడం కల్వకుర్తి ప్రాంతానికి గర్వకారణమని కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నాలుగు జిల్లాలకు తాగు, సాగునీరందించే ప్రాజెక్టుకు జైపాల్‌రెడ్డి నామకరణం చేస్తూ కేబినెట్ ఏకగ్రీవ తీర్మానం చేయడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కల్వకుర్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మార్చాల గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటయ్య కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. మృతుని తల్లి బాలమ్మకు గ్రామ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలోమార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాలయ్య, మాజీ సర్పంచ్‌లు సునీత, కృష్ణయ్య, నాయకులు వెంకటరెడ్డి, మల్లేష్, మనోహర్‌రావు, రాంరెడ్డి, లింగం, నరేష్‌గౌడ్, కృష్ణయ్య, కిశోర్, నిజామ్, తిరుపతయ్య, గణేష్, రాజు, జంగయ్య ఉన్నారు.

సగర కమ్యూనిటీ భవనం ప్రారంభం

కల్వకుర్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో సగర కమ్యూనిటీ భవనాన్ని ఆదివారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీనివాసులు ప్రారంభించారు. నూతన క్యాలెండర్‌ను సైతం ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాజా మాజీఎంపీ పోతుగంటి రాములు తన ఎంపీ నిధుల నుంచి కేటాయించిన డబ్బులతో సగర కమ్యూనిటీ భవనాన్ని నిర్మించారని ఆయన పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసిన మాజీ ఎంపీ రాములుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. సగర సంఘం మండల గౌరవ అధ్యక్షుడు దుర్గయ్య, అధ్యక్షుడు సురేష్, పట్టణ అధ్యక్షుడు రాజు, నాయకులు వివేకానంద, రాజు, రాకేష్, జంగయ్య, యాదగిరి, భరత్, దాసు, తిరుపతయ్య, శంకర్, యాదయ్య, మురళి, అర్జున్, నరేష్, శ్రీకాంత్ ఉన్నారు.

అభయుడి ఆలయ ధర్మకర్తల మండలి ఎంపిక

ఊర్కొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామివారి ఆలయం ధర్మకర్తల మండలి ఎంపిక అయినట్లు ఆలయం అధికారులు తెలిపారు. ఆలయం ధర్మకర్తల మండలి సభ్యులుగా ఊర్కొండపేటకు చెందిన తిర్మని బొందయ్య, మొండెళ్ల రమేష్, గుండమోని మల్లేష్, అమరచింతల వెంకటమ్మ, రాచాలపల్లికి చెందిన సత్యనారాయణరెడ్డి, కాల్యతండాకు చెందిన గోపాల్‌నాయక్, ఠాకూర్ తండాకు చెందిన రమావత్ పత్యా, గుండ్లగుంటపల్లికి చెందిన నెల్లికొండ (కర్నాటి) రజిత, ఊర్కొండకు చెందిన విజేందర్, ముచ్చర్లపల్లికి చెందిన దార బంగారయ్య, రేవల్లికి చెందిన కే.వెంకటయ్య, గుడిగానిపల్లికి చెందిన చిదిరే అంజనేయులు, జకినాలపల్లికి చెందిన జీ.వెంకటయ్య ప్రధాన అర్చకులుగా ఊర్కొండకు చెందిన మహేష్‌లు ఉన్నారన్నారు. ఈ కమిటీ సంవత్సర కాలం పాటు కొనసాగనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఉపకార వేతనాల జాబితాలను అందజేయాలి

మన్ననూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదివే గిరిజన విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం ఉపకార వేతనాల కోసం నూతన దరఖాస్తులు, రెక్యూవల్‌లను ఈ పాస్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి(డీటీడీఓ) ఫిరంగి ఆదివారం తెలిపారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు విద్యార్థులు దరఖాస్తు చేసినటువంటి దరఖాస్తు ప్రతులను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు. మార్చి 31 వరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా ఉపకార వేతనాలు మంజూరవుతాయని తెలిపారు.

ప్రేమ్‌నాయక్ విజయంపై హర్షం



ఊర్కొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఊర్కొండ మండలం గుండ్లగుంటపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రెడ్యా తండాకు చెందిన ప్రేమ్ కుమార్ డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ సెక్రటేరియట్ ఉద్యోగ సంఘం ఎన్నికల్లో ప్రధాన ప్రధాన కార్యదర్శిగా భారీ మెజారిటీతో విజయం సాధించడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్ మాట్లాడుతూ రెడ్యా తండాలో జన్మించి అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు ఉద్యోగ సంఘం ఎన్నికల్లో విజయం సాధించడం మా తండాకు గర్వకారణం అని పేర్కొన్నారు.

రైతు భరోసాపై ప్రభుత్వ నిర్ణయం హర్షదాయకం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి

వంగూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగుతో సంబంధం లేకుండా సాగుకు యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోందని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొండారెడ్డిపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతుబంధు కింద ఏటా రూ.10 వేలు ఇస్తే మా ప్రభుత్వం ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలనినిర్ణయించిందన్నారు. భూమిలేని కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున సాయం చేయాలని నిర్ణయించడంతో ఆ కుంటుబాలకు ఎంతో మేలు చేకూరనుందన్నారు. కార్యక్రమంలో వేమారెడ్డి, లాలు యాదవ్, వంశీ, సంతు, చందు, శ్రీరాములు, రాఘవేందర్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు భరోసా

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

చారకొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) ముఖ్యమంత్రి సహాయనిధి నిరు పేదలకు భరోసా కల్పిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లి పడమటితండాకు చెందిన కొర్రవత్ కోమిటి అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఓప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందింది. ఆర్థిక ఇబ్బందుల వల్ల సీఎం సహాయ నిధికోసం ఆమె దరఖాస్తు చేసుకోగా రూ. 60వేలు మంజూరవగా, ఆ చెక్కును ఆదివారం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు.

● మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన మణెమ్మకు రూ. 60 వేలు, చిట్టికి 16,500, గెల్వయ్యకు రూ. 18 వేలు, బుచ్చాలుకు రూ. 26వేలు ఎమ్మెల్యే కృషి వల్ల మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలాది బాలరాజు, నాయకులు బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో జూపల్లి రాములుయాదవ్, సురేస్, రాములు, కుమార్ సింగ్, గోపి, దేవేందర్, గోపాల్, లక్ష్మణ్, రవి, జంగయ్య, ఎండీ మహమ్మద్, సంజీవ, నిరంజన్, శ్రీను, జంగయ్య పాల్గొన్నారు.


బాధితునికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

ఆటలు సాగడం లేదు

- నిర్లక్ష్యపు నీడలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు

కల్వకుర్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ యువతీ యువకుల్లో క్రీడా నైపుణ్యం, శారీరక దారుఢ్యం పెంపొందించేందుకు గతంలో ఊరూరా లక్షల రూపాయలు వెచ్చించి తెలంగాణ క్రీడాప్రాంగణాలను నిర్మించారు. నిర్మాణ క్రమంలో హడావిడి చేసిన అధికారులు పనులు పూర్తయ్యాక వాటిని పట్టించుకోకపో వడంతో అవి ఎక్కడా వినియోగంలోకి లేకుం డాపోయాయి.

● జిల్లాలో చాలా గ్రామాల్లో నీటి పరివాహక ప్రాంతాలు, గుట్టలు, అనువుగాని స్థలాల్లో, పాఠశాలల ఆవరణలో తెలంగాణ గ్రామీణ క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేశారు. క్రీడా ప్రాంగణాలు పూర్తయ్యాయని అన్పించుకున్నారు. వీటి నిర్వహణ లేక ప్రస్తుతం పిచ్చి మొక్కలు పెరగడం వల్ల ఎక్కడా ఆటలు సాగడం లేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగమయ్యాయి. జిల్లాలో 544 క్రీడా ప్రాంగణాలకు క్రీడా సామగ్రి పంపిణీ చేయగా ఆట సామగ్రి, కిట్లు, గ్రామ పంచాయతీల్లోనే మూలుగుతున్నాయి. దీంతో క్రీడా ప్రాంగణాలు చిట్టడవులను తలపిస్తూ అలంకార ప్రాయంగా మారాయి. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లా పరిధిలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో నిర్మించిన క్రీడా ప్రాంగణాలను సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తే ప్రయోజనం కలుగుతుంది.



నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

నిమ్స్ హాస్పిటల్‌లో పలువురికి పరామర్శ

పెద్దకొత్తపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో నిమ్స్ ఆస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కొల్లాపూర్ ప్రాంతానికి చెందిన పలువురిని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని గురించి వైద్యులను అడిగి ఆయన తెలుసుకున్నారు. కొల్లాపూర్ పట్టణానికి చెందిన తెలంగాణ రాష్ట్ర మాలల చైతన్య సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దెల రాందాస్ రోడ్డు ప్రమాదంలో గాయపడి నిమ్స్ హాస్పిటల్ చికిత్స పొందుతుండగా అతన్ని పరామర్శించారు. అదే హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పెద్దకొత్తపల్లి మండలం చిన్నకార్పాముల గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి రాంరెడ్డిని మంత్రి జూపల్లి పరామర్శించారు.


నిమ్స్‌లో చికిత్స పొందుతున్న రాంరెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

శ్రీరామ సేన సొసైటీ కార్యవర్గం ఎన్నిక

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ సేన వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గం ఏర్పడింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని సొసైటీ భవనంలో కన్వీనర్‌గా తీగల భాస్కర్ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీరామ సేన సొసైటీ గౌరవ అధ్యక్షుడిగా ఖానాపురం శ్రీనివాసులు, నూతన అధ్యక్షుడిగా గొల్ల నిరంజన్, ఉపాధ్యక్షులుగా కుంభం మల్లేష్‌గౌడ్, తోగర సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఏటిగడ్డ శ్రీనివాసులు, జాయింట్ సెక్రెటరీలుగా పూలమోని వీరయ్య, పాలమూరు శంకరయ్య, కోశాధికారిగా రాగిశెట్టి పుల్లయ్య, సభ్యులుగా మాదాసు శ్రీనివాసులు, తీగల మల్లేష్, జంగిటి సైదులు, న్యాయ సలహాదారులుగా గుర్రం శ్రీనివాసులను ఎన్నునున్నారు. ఈ సందర్భంగా సొసైటీ నూతన అధ్యక్షుడు గొల్ల నిరంజన్ మాట్లాడుతూ శ్రీరామ సొసైటీ ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యలపై స్పందిస్తుందని పేర్కొన్నారు.



శ్రీరామ సేన నూతన కార్యవర్గం

పట్టు జారితే అంతే..

- ప్రయాణం ప్రమాదకరం
- పల్లెలకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- దయ చూపని అధికారులు

పెద్దకొత్తపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చాలా గ్రామాలు, తండాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఏదైనా ప్రైవేటు వాహనం వస్తే తోసుకుంటూ ఎక్కాల్సిన పరిస్థితి దాపురించింది. మండలంలోని దేవునిపల్లి, జొన్నలబొగడ, దేవినేనిపల్లి తండా, చంద్రబండతండా, తిర్నాంపల్లి, మారేడుమాన్‌దిన్నె, వేడుకరావుపల్లి, పెరుమళ్లపల్లి, ముష్టిపల్లి, మరికల్ తదితర గ్రామాలకు సక్రమంగా బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ప్రజలు, రైతులు మైళ్ల దూరం కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత్యంతర లేని పరిస్థితిలో ఆటోలు, జీపులను ఆశ్రయిస్తుండగా సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించు కోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఆటోలో వెనుక భా గంలో నిలబడి జీపుల్లో టాప్‌పై కూర్చుని ప్రయాణం చేయడం వల్ల ప్రమాదాలు జరగక తప్పడంలేదు. చాలా రూట్లలో ఆర్టీసీ బస్సులు నడపడం లేదు. దీంతో ప్రజలు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతీ పల్లెకు, తండాలకు పల్లె వెలుగు బస్సులు నడిపేలా కృషి చేయాలని ఆయా గ్రామాల, తండాల వాసులు కోరుతున్నారు.


పెద్దకొత్తపల్లి నుంచి తీగలపల్లికి ఆటో వెనుక భాగంలో నిలిచిన ప్రయాణికులు


పెద్దకొత్తపల్లి నుంచి పెద్దకార్పాములకు ఆటోలో సామర్థ్యాన్ని మించి వెళ్తున్న మహిళలు